క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్లల్లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 25, వంకాయ 23, బెండ 55, పచ్చి మిర్చి 37, కాకర 35, బీర 50, క్యాబేజి 10, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 19, దొండ 27–35, చిక్కుడు 35, గోకర 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 45, ఆలు 19, దోస 28, సొర 13, పొట్ల 13, ఉల్లి 16, చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

చీకోటి ప్రవీణ్ కారు అపహరణ

సైదాబాద్: ఈడీ కేసుల్లో విచారణ ఎదుర్కొన్న క్యాసినో వ్యాపారి చీకోటి ప్రవీణ్ కారు అపహరణకు గురికావడం కలకలం సృష్టించింది. చీకోటి ప్రవీణ్ కారు అపహరణ ఘటన మామూలు దొంగల పనా లేకుంటే ఎవరైనా అతని ఇంటి వద్ద రెక్కీ సృష్టించే క్రమంలో చోటుచేసుకుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వివరాలివీ... క్యాసినో వ్యాపారం నిర్వహించే చీకోటి ప్రవీణ్ ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తారు. ఇటీవల ఆయన ఈడీ విచారణ ఎదుర్కొన్న సంగతి విదితమే. సోమవారం తెల్లవారుఝామున అయన నివసించే అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో పార్క్ చేసిన ఆయనకు చెందిన ఇన్నోవా క్రిస్టో (టీఎస్ ఈక్యూ0444) వాహనాన్ని గుర్తుతెలియని దుండగులు తీసుకెళ్లారు. కారు అపహరణ విషయమై చీకోటి ప్రవీణ్ మంగళవారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు అపార్ట్‌మెంట్‌లోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మధుసూదన్‌రెడ్డి



చంపాపేట: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చంపాపేట డివిజన్ కార్పొరేటర్, బీజేపీ ఎల్‌బీనగర్ సీనియర్ నేత వంగా మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మంగళవారం మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. అనంతరం వంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో బాధ్యతాయుతమైన పదవిలో తనను నియమించినందుకు రాష్ట్ర పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే శాసన సభ ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లను కైవసం చేసుకుని రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీజేపీ కార్యక్రమాలను మరింత విస్తృతం చేసిచి బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



మెడల్స్ సాధించిన విద్యార్థులు

వనస్థలిపురం: విశాఖలోని భారతి స్టేడియంలో సోమవారం నిర్వహించిన 1వ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాపియన్‌షిప్ సీఎం కప్–2023 పోటీల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారని వనస్థలిపురం రేడియో కాలనీలోని తపస్వీ స్కూల్ డైరెక్టర్ గొరిగ ప్రదీప్‌కుమార్ తెలిపారు. జి.అరుష్‌రెడ్డి గోల్డ్‌మెడల్, మహిత్‌రెడ్డి సిల్వర్ మెడల్, మణిత్‌రెడ్డి బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. వీరు మరో పది రోజుల్లో మలేషియా, బ్యాంకాక్‌లో జరిగే ఇంటర్నేషనల్ పోటీల్లో పాల్గొనే అవకాశం సాధించారని ఆయన పేర్కొన్నారు.

అధికారులు సహకరించకున్నా...

అభివృద్ధిపై రాజీపడం

ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి



సైదాబాద్: రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం. ప్రజల ఆదరణతో ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తరువాత ప్రజు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, డివిజన్ అభివృద్ధికే ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతున్నామని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి పేర్కొన్నారు. సింగరేణికాలనీ, ఖాజాబాగ్, చింతల్, డీఎస్‌నగర్ వంటి బస్తీలు, అధునాతన కాలనీలు కలిసి ఉన్న ఐఎస్ సదన్ సమగ్రాభివృద్ధి కోసం నిత్యం డివిజన్‌వాసులతో మమేకం అవుతూ వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని ఆమె తెలిపారు. అయితే ప్రతిపక్ష పార్టీ ప్రజాప్రతినిధిగా జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ వివక్ష చూపుతూ సహకారం అందించక పోయినా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం పాటుబడుతున్నామని ఆమె స్పష్టం చేశారు. ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్‌గా రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా డివిజన్‌లో పూర్తి చేసిన, చేపట్టనున్న అభివృద్ధి పనులపై కార్పొరేటర్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ.

ప్రశ్న: ఎన్నికల హామీలను నెరవేర్చారా?

జవాబు: రెండేళ్ల కాలంలో డివిజన్ అభివృద్ధిలో భాగంగా రూ. 25 కోట్లతో వివిధ పనులు చేపట్టాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అరవై శాతం పనులు పూర్తి చేసాం. అదనంగా లక్ష్మీనగర్ కాలనీ పార్క్‌లో నిర్మిస్తున్న థీమ్ పార్క్ పనులు తుదిదశలో ఉన్నాయి. ఇంకా డివిజన్ పరిధిలోని మురికివాడలు, బస్తీల్లో పలు మౌళిక వసతులు కల్పించాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రశ్న: ప్రధాన సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: మూడు, నాలుగు సంవత్సరాలుగా వర్షాకాలంలో ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని 15 కాలనీలు సహా పలు బస్తీలు తీవ్ర ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. ముంపు సహాయ చర్యలు పడవలో వెళ్లి చేపట్టాల్సి వచ్చేదంటేనే ఇక్కడి సమస్య తీవ్రత ఎంత ఉందో తెలుస్తోంది. ప్రథమ ప్రాధాన్యంగా ఇక్కడ బాక్స్‌డ్రెయిన్ నిర్మించాల్సిన అవసరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాం. సింగరేణి ఆఫీసర్స్ కాలనీ బతుకమ్మ ఘాట్ నుంచి శంకేశ్వరబజార్ చౌరస్తా వద్దనున్న మసీద్ వెనుక ఉన్న నాలాకు అనుసంధానం చేసేలా ప్రారంభించిన బాక్స్‌డ్రెయిన్ నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయి.

ప్రశ్న: ముంపు సమస్య శాశ్వతంగా తీరినట్లేనా?

జవాబు: సింగరేణి కాలనీ నుంచి శంకేశ్వరబజార్ వరకు బాక్స్‌డ్రెయిన్ నిర్మాణం సాగుతోంది. ఎగువ ప్రాంతమైన బాలాజీనగర్‌లోని స్విమ్మింగ్‌పూల్ నుంచి సింగరేణి కాలనీ వరకు బాక్స్‌డ్రెయిన్ నిర్మించి ప్రస్తుత నిర్మాణానికి దానిని అనుసంధానిస్తే ముంపు సమస్య పూర్తిగా పరిష్కారమవుతుంది. బాలాజీనగర్ నుంచి నిర్మించాల్సిన బాక్స్‌డ్రెయిన్ పనుల ఫైల్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఆ పనులు కూడా త్వరలో మొదలయ్యేలా ప్రయత్నిస్తాం.

ప్రశ్న: రహదారులు, తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: ప్రధాన, అంతర్గత రహదారులను ఆధునికీకరిస్తున్నాం. భారత్‌గార్డెన్ నుంచి లక్ష్మీనగర్ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రహదారి పనులు పూర్తయ్యాయి. మురికివాడల్లో తాగునీటి సమస్య పూర్తిగా తొలిగిపోయిందని చెప్పలేం. సింగరేణికాలనీ డివిజన్‌లోనే అతిపెద్ద మురికివాడ ప్రాంతం. ఇక్కడ మౌలిక వసతులు కల్పించడానికి అధికారులు సాకులు చెపుతున్నారు. సింగరేణి కాలనీవాసులు దశాబ్దాల కాలం నుంచి నీటి అవసరాల కోసం జలమండలి సరఫరా చేసే వాటర్‌ట్యాంక్‌లపైనే ఆధారపడుతున్నారు. ఒకోసారి తాగునీరు పట్టుకోవడానికి వారు పనులు మానుకొని ఇంటి వద్ద ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రూపాయికే తాగునీటి కనెక్షన్ పథకాన్ని సింగరేణికాలనీలోనూ అమలు చేసి ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇవ్వాలి. సింగరేణికాలనీలోని ఇళ్లకు కరెంట్ మీటర్లు మంజూరు చేస్తే వారికి ఉపయుక్తంగా, విద్యుత్‌శాఖకు ఆదాయం పెరుగుతుంది.

ప్రశ్న: అధికారులు, ఎమ్మెల్యేల సహకారం ఎలా ఉంది?

జవాబు: ప్రజాప్రతినిధులైనా, ప్రభుత్వ అధికారులైనా అభివృద్ధికి, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజాసమస్యల విషయమై ఎన్నిసార్లు జీహెచ్‌ఎంసీ సౌత్‌జోన్ జోనల్ కమిషనర్‌కు వినతులిచ్చినా స్పందించడం లేదు. గత సంవత్సరం డిసెంబర్‌లో ఐఎస్‌సదన్‌లో రూ. 2 కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల విషయమై జోనల్ కమిషనర్‌కు విన్నవించినా ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదు. అధికారంలో ఎవరూ శాశ్వతం కాదని వారు తెలుసుకోవాలి. యాకత్‌పురా నియోజకవర్గ పరిధిలో ఐఎస్‌సదన్ డివిజన్ నుంచే ఎక్కువగా ప్రభుత్వానికి పన్నుల రూపంలో రాబడి ఉంటుంది. అయినా ఎమ్మెల్యే, ఎంపీలు ఇక్కడ అబివృద్ధిని విస్మరిస్తున్నారు.

ప్రశ్న: భవిష్యత్‌లో సమస్యలు ఎలా పరిష్కరిస్తారు?

జవాబు: జీహెచ్‌ఎంసీ సౌత్‌జోన్ అధికారులు వివక్ష చూపినంత మాత్రాన ఐఎస్‌సదన్‌లో అభివృద్ధి ఆగిపోదు. ఉన్నతాధికారులకు విన్నవించి పనులు ముమ్మరంగా సాగేలా కృషి చేస్తాం. అవసరమైతే కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేసి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించేలా ప్రయత్నిస్తాం.

'స్థలం' కేటాయించాలని మంత్రికి ఎమ్మెల్యే వినతి



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని ఇందు అరణ్య ఫారెస్ట్‌లో ఉన్న కొంత స్థలంలో గోల్డెన్ లీవ్స్ విల్లాల్లో నివాసం ఉండే వారికి వాకింగ్ ట్రాక్, యోగా, ఓపెన్ జిమ్ కోసం కొంత స్థలం కేటాయించాలి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం గోల్డెన్ లీవ్స్ విల్లా నివాసులతో కలసి అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అరణ్య భవన్‌లో కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్, యోగా, ఓపెన్ జిమ్ కోసం అనువైన ప్రభుత్వ భూమి లేనందున ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. పక్కనే ఉన్న ఇందు అరణ్య ఫారెస్ట్‌లో కొంత స్థలం కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అటవీ శాఖ అధికారులతో చర్చించి వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్వయంగా ఆ ప్రాంతంలో పర్యటిస్తారని తెలిపారు. మంత్రి స్పందన పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, గోల్డెన్ లీవ్స్ సభ్యులు మోహన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, హరిందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, విక్రమ్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిమ్స్ స్థలంలో రేకుల ప్రహరీ తొలగింపు

చైతన్యపురి: చైతన్యపురిలోని టిమ్స్ స్థలంలో రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన రేకుల ప్రహరీని తొలగించారు. ఒక వర్గానికి అన్యాక్రాంతం చేయాలని ఎకరానికి పైగా స్థలాన్ని వదిలేసి టిమ్స్ స్థలంలో అక్రమంగా ప్రహరీ ఏర్పాటు చేస్తున్నారని స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని వారు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్, ఎల్‌బీనగర్ ఏసీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో టిమ్స్ స్థలాన్ని సందర్శించిన జీహెచ్‌ఎంసీ సిటీ ప్లానర్ ప్రసాద్ పరిశీలించి ప్రహరీని వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో రాత్రికి రాత్రే రేకుల ప్రహరీని తొలగించారు. ఒక వర్గానికి అన్యాక్రాంతం చేసేందుకు యత్నిస్తున్నారని తాము చేసిన ఫిర్యాదుకు స్పందించిన జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులకు కార్పొరేటర్ నర్సింహగుప్తా కృతజ్ఞతలు తెలిపారు. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం కేటాయించిన స్థలంలో ఇతర నిర్మాణాలు జరిపితే ఎట్టి పరిస్థితిలో ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు.

నేడు బీజేపీ కార్యకర్తలతో కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి సమావేశం

సైదాబాద్: హైదరాబాద్ పార్లమెంటరీ ప్రవాస్ యోజనలో భాగంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి భాగ్యనగర్ జిల్లాలోని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. బుధవారం ఉదయం సైదాబాద్‌లోని ఎస్‌బీహెచ్ ఏ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగులతో కేంద్ర మంత్రి సమావేశమవుతారన్నారు. మధ్యాహ్నం చంపాపేటలోని ఎస్‌పీజీ గ్రాండ్‌హోటల్‌లో బీజేపీ భాగ్యనగర్ జిల్లా పరిధిలోని 400 శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం అవుతారని తెలిపారు. సాయంత్రం సైదాబాద్ ఫిష్ మార్కెట్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద నిర్వహించే బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో కేంద్ర మంత్రి పాల్గొంటారని జిల్లా అధ్యక్షుడు వివరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



ఎల్‌ఓసీని అందజేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి



చెక్కను అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మంత్రి సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌కి చెందిన రాజపోచయ్యకు కాళ్ల నరాల (వెరికో వీన్స్)సమస్యతో బాధ పడుతూ చికిత్స కోసం స్థానిక నాయకులను సంప్రదించారు. వారు మంత్రి సబితాఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించ సబితాఇంద్రారెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 1.25 లక్షల ముందస్తు చెక్కు మంగళవారం రాజపోచయ్యకు మంత్రి చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ... పేద మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు సాజీద్, సాయికుమార్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి...

నాగోలు: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు వరలాంటిదని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం దుప్పలపల్లి గ్రామానికి చెందిన నిరుపేద వేణు అనారోగ్య సమస్యలతో హాస్పిటల్‌లో చేరి చికిత్స చేయించుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు రావడంతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 33 వేలకు సంబంధించిన చెక్కును మంగళవారం నాగోలులో వేణుకు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... పేదలు సీఎం రిలీఫ్ ఫండ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేద యువతుల వివాహానికి చేయూత..

ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు చెందిన ఇద్దరు యువతుల వివాహానికి మంగళవారం ఉప్పల శ్రీనివాస్‌గుప్తా చేయూతనందించారు. వారికి మంగళసూత్రాలు, మెట్టెలు, చీరలు, గాజులతోపాటు ఒక్కొక్కరికి 100 కేజీల చెప్పున బియ్యం విరాళంగా అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన ప్రణహిత వివాహం, సూర్యాపేట జిల్లా ఉక్కడం గ్రామానికి చెందిన స్వరూప వివాహం వాటిని అందజేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతా

జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి



మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకనై పోరాటం చేస్తానని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీపై చేస్తున్న పోరాటాన్ని గుర్తించి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా బీజేపీ నియమించిందన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ప్రజలు ఇచ్చిన స్ఫూర్తితో పార్టీ ఇచ్చిన బాధ్యతలను రెట్టించిన ఉత్సాహంతో ప్రజల పక్షాన పోరాటం చేస్తానని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ నిధుల్లో ఎమ్మెల్యేల పెత్తనం కొనసాగుతోందని, దీన్ని నివారించేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్థానిక సంస్థల నిధులు స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రాతినిధ్యం లేకుండా చేయడం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన స్పష్టం చేశారు.

బీజేపీ కార్నర్ మీటింగ్‌లకు విశేష స్పందన



ఇంద్రానగర్‌లో మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: ప్రజాగోస–బీజేపీ భరోసా నినాదంతో పార్టీ చేపట్టిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్, సురేందర్‌రెడ్డి డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్‌లో జరిగిన 245, 246వ బూత్‌లకు చెందిన కార్నర్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కమ్యూనిటీ హాల్ మొదటి ఫ్లోర్ వేయిస్తామని హామీ ఇచ్చారు. మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి చందు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు యాదగిరి సురేందర్, కొప్పుల దినేష్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, పవన్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే: నల్లు ఇంద్రసేనారెడ్డి

ఎల్‌బీనగర్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను బీజేపీ కార్నర్ మీటింగ్‌ల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డి, బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్‌జీఓఎస్ కాలనీలో కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్నామని, ప్రతి ఒక్కరికీ కేంద్ర సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శరత్‌కుమార్, విష్ణువర్ధన్, క్రాంతికిరణ్, సుధీర్, ఫణి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'నిషా'చరులకు జైలు శిక్ష

మలక్‌పేట: ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాలలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 26 మంది వాహనదారులను మంగళవారం నాంపల్లి 3వ ఎంఎమ్ కోర్టు ఎదుట హాజరు పరిచినట్లు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న తెలిపారు. వారిలో 22 మంది మొదటిసారి పట్టుబడగా ఒక్కొక్కరికి రూ. 2100, రెండోసారి నలుగురు పట్టుబడగా ఒక్కొక్కరికి రూ. 3300 జరిమానా విధించారు. ముగ్గురికి 6 రోజులు, ఇద్దరికి 5 రోజులు, ఒకరికి 4 రోజులు జైలు శిక్ష ఖరారు చేసిందన్నారు. ఒకరిది 18 నెలలు, మరొకరిది 8 నెలలు ఇద్దరు వాహనదారుల లైసెన్స్ సస్పెండ్ చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వివరించారు.

జంట పేలుళ్ల మృతులకు పలువురి నివాళి



బాంబు పేలుళ్ల మృతులకు నివాళులర్పిస్తున్న యాంటీ టెర్రరిజం ఫోరం నాయకులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్లలో మరణించిన వారికి మంగళవారం పలువురు నివాళులర్పించారు. రాజీవ్‌చౌక్‌లోని ఏ–1 మిర్చి సెంటర్, 107 బస్‌స్టాప్ ప్రాంతాల్లో ఉగ్రవాదులు బాంబులు పేల్చి పది సంవత్సరాలైన సందర్భంగా పేలుళ్లలో 17 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా పలువురు గాయాల పాలైన విషయం విదితమే.

యాంటీ టెర్రరిజం ఫోరం ఆధ్వర్యంలో...

యాంటీ టెర్రరిజం ఫోరం అధ్యక్షుడు బ్రహ్మచారి, కార్యదర్శి గంగం నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏటీఎఫ్ కన్వీనర్ డాక్టర్ రావినూతల శశిధర్ పేలుడు జరిగిన ప్రాంతంలో మృతులకు నివాళులర్పించారు. నేతలు రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మనోజ్, సంతోష్, రాము, వంశీ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో...

బీఆర్‌ఎస్ పార్టీ గడ్డిఅన్నారం డివిజన్ నేతలు కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ భవానీప్రవీణ్‌కుమార్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, నేతలు బిచినేపల్లి వెంకటేశ్వర్‌రావు, మల్లిక, ప్రేమ్‌నాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆప్ ఆధ్వర్యంలో...

ఆమ్ ఆద్మీ పార్టీ ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో బాంబు పేలుళ్ల బాధితులతో కలసి మృతులకు నివాళులర్పించారు.



కొవ్వొత్తులతో బీఆర్‌ఎస్ నేతలు...



ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు..

కార్పొరేట్ పంజాతో స్వర్ణకార వృత్తి కుదేలు

ఆదుకోవాలని మంత్రి కేటీఆర్‌కు స్వర్ణకార సంఘం వినతి



మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న స్వర్ణకారుల సంఘ నేతలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: కార్పొరేట్ విక్రయ కేంద్రాల పంజాతో స్వర్ణకార చేతివృత్తిదారులు ఉపాధిలేక అర్ధాకలితో అలమటిస్తున్నారని వారి సంక్షేమం కోసం ప్రత్యేకంగా స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని రాష్ట్ర స్వర్ణకార సంఘ అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి కోరారు. మంగళవారం ఆయన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్‌ను కలసి స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. అనంతరం రాఘవాచారి మాట్లాడుతూ... గడచిన ఆరు మాసాలుగా రాష్ట్రంలో ఉపాధి కరువైన 11 మంది చేతివృత్తి స్వర్ణకారులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వర్ణకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు నిండిన ప్రతి స్వర్ణకారునికి పింఛన్, డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయించాలని కోరారు. దొంగ బంగారం కొనుగోలు చేస్తున్నారని ప్రతి స్వర్ణకారుడినీ పోలీసులు వేధిస్తున్నారని పూర్తి స్థాయి విచారణ అనంతరమే కేసులు నమోదు చేయాలని కోరారు. స్వర్ణకారుల సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలంగా స్పందిచారని రాఘవాచారి స్పష్టం చేశారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చేపూరి వెంకటస్వామి, రామదాసు, లక్ష్మణాచారి, సతీష్‌కుమార్, రత్నమాచారి, రాజు, భీష్మాచారి, బాలేస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న వెంకట్‌రెడ్డి దంపతులు

హస్తినాపురం: అనుపమానగర్‌కాలనీలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి తృతీయ బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గణపతి పూజతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కుడుముల వెంకట్‌రెడ్డి దంపతులు హోమం నిర్వహించారు. కార్యక్రమంలో డి.చంద్రశేఖర్‌రెడ్డి, వి.సుధాకర్‌రెడ్డి, ఆర్.రవీందర్‌కుమార్, జి.విష్ణువర్ధన్ రెడ్డి, గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, ఎం.కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.